క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

నంద్యాల(అర్బన్): ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటారని డీఈఓ జనార్దన్‌రెడ్డి సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం నంద్యాల మండలం కానాల గ్రామంలో డీఈఓ పర్యటించారు. గ్రామ రహదారుల్లోని చెత్త తొలగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నా రు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టించుదామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుగుణశ్రీ, సర్పంచ్ బావమ్మ, హెచ్ఎం భాస్కరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెరువులను కాపాడండి

నంద్యాల(న్యూటౌన్): మహానంది మండలం గాజులపల్లె వద్ద జరుగుతున్న రైల్వే డబుల్‌లైన్ పనులకు గోపవరం గ్రామంలో ఉన్న బైరవాని చెరువు, నంద్యాల మండలం అయ్యలూరు చెరువు మట్టిని వాడటం సరికాదని, దీని వల్ల రైతులకు ఇబ్బందులు తలెత్తుతాయని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మట్టి తరలింపుతో చెరువులు స్వరూపాన్ని కోల్పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి మట్టి తరలింపును అడ్డుకోవాలని కోరారు.

ఈస్టర్‌కు ముస్తాబు


ప్రత్యేకంగా అలంకరణలో చాకరాజువేముల చర్చి

దొర్నిపాడు: క్రైస్తవులకు ముఖ్యమైన పండుగల్లో ఈస్టర్ (పునరుత్థానం) ఒకటి. పాపుల కొరకు క్రీస్తు సిలువపై ప్రాణత్యాగం చేసిన రోజు గుడ్‌ఫ్రైడే జరుపుకుంటారు. మూడో రోజు ఆదివారం క్రీస్తు సమాధి నుంచి తిరిగి లేవడంతో ఈస్టర్ పండుగను రంగులు చల్లుకుంటూ భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. అనంతరం నూతన దుస్తులు ధరించి చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఈ నేపథ్యంలో మండలంలోని చర్చిలను క్రైస్తవులు ప్రత్యేకంగా అలకరించారు.

గుండ్రేవుల నిర్మాణం చేపట్టాలి


ధర్నా నిర్వహిస్తున్న రాయలసీమ రైతు సంఘం నాయకులు

ఆళ్లగడ్డ: రాష్ట్ర ప్రభుత్వం గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం వెంటనే చేపట్టాలని రాయలసీమ రైతు సంఘాల సమాఖ్య, సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ అంశంపై శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 64 సంవత్సరాలుగా రాయలసీమకు నీటి కేటాయింపుల్లో అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. సీమకు చట్టబద్ధమైన నీటి హక్కు సాధనకు రైతులు నడుం బిగించాలని లేక పోతే ఈ ప్రాంతం ఎడారిగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మి నరసింహ కంబగిరిస్వామి, శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీ లక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు వేకువజామున ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు లక్ష్మణస్వామి, కమలేష్‌శర్మ, అనంతయ్య, భాస్కరశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

22న ఉద్యోగ మేళా

నంద్యాల (అర్బన్): ఈనెల 22న నూనెపల్లె ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి సోమశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ఆపై విద్యార్హత కలిగి 18 ఏళ్ల నుంచి 30 ఏళ్లలోపు వయస్సు ఉన్న యువతీయువకులు మేళాకు అర్హులన్నారు. ఆసక్తి గల వారు www. ncr.gov.i n రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

పంట నష్టాన్ని పక్కాగా అంచనా వేయండి

రుద్రవరం: ఈదురు గాలుల వల్ల జరిగిన పంట నష్టాన్ని పక్కాగా అంచనా వేసి నివేదిక ఇవ్వాలని ఉద్యానవన శాఖ జిల్లా అధికారి నాగరాజు సిబ్బందికి సూచించారు.మండలంలోని ఆలమూరులో శుక్రవారం ఈదురు గాలులకు బొప్పాయి తోటల్లో చెట్టు విరిగి పడ్డాయి. శనివారం ఆయన ఆ శాఖ సిబ్బంది శ్రీధర్ తదితరులతో కలిసి వెళ్లి తో టలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలమూరు పరిధిలోని రైతులు దాదాపు 168 ఎకరాల్లో బొప్పాయి సాగు చేశారన్నారు. వాటిని పరిశీలించి 80 ఎకరాల్లో తోటలు దెబ్బతిన్నాయని ప్రాథమిక అంచనా వేశామ న్నారు. క్షేత్ర స్థాయి పరిశీలన తర్వాత నష్ట పోయిన రైతుల జాబితాను ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు.

'నీట్'కు పకడ్బందీ ఏర్పాట్లు

- విద్యార్థులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలి
- నీట్ పరీక్ష కేంద్రాల పరిశీలనలో కలెక్టర్ రాజకుమారి


పాలిటెక్నిక్ కళాశాలలో నీట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. నంద్యాల పట్టణంలో నీట్ పరీక్ష కేంద్రాలైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బస్టాండ్ సమీపంలో గవర్నమెంట్ హైస్కూల్, టెక్కె జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను శనివారం కలెక్టర్ పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వచ్చేనెల 4వ తేదీన నీట్ యూజీ పరీక్ష జరుగుతుందని చెప్పారు. జిల్లాలో దాదాపు 1,170 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాయనున్నార న్నారు. కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు సమకూర్చాలన్నారు. పరీక్షలు నిర్వహిస్తున్న ప్రతి కేంద్రంలో డెస్కులు శుభ్రంగా ఉండడంతో పాటు ఒక్కో విద్యార్థికి ఒక్కో డెస్క్ కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని చెపఅపరు. ప్రతి గదిలో ఫ్యాన్లు ఉండేలా చూసుకోవాలన్నారు. ఎండవేడిమి ఎక్కువగా ఉన్నందున కేంద్రాల్లో కూల్ వాటర్ ఏర్పాటు చేయాలన్నారు.దివ్యాంగ అభ్యర్థుల కోసం కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, వీల్ చైర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అభ్యర్థులు సమయం చూసుకునేందుకు వీలుగా గోడ గడియారాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ జనార్దన్ రెడ్డి, నీట్ అబ్జర్వర్ సత్యనారాయణ, ఆఓ ఆర్‌డీ విశ్వనాథ్ తదితరులు కలెక్టర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను సక్రమంగా నిర్వహించాలి


ఉయ్యాలవాడ అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న జిల్లా మైనారిటీ అధికారిణి పర్వీన్

ఉయ్యాలవాడ: పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని ఉమ్మడి కర్నూలు జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారిణి, మండల ప్రత్యేకాధికారిణి సబీహా పర్వీన్ ఆదేశించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రం ఉయ్యాలవాడలోని 4వ అంగన్‌వాడీ కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆమె సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో మండలాధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యం కోసం పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. శారీరక, మానసిక ఎదుగుదల లోపించిన చిన్నారులను గుర్తించి వారికి అదనంగా పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ఐసీడీఎస్, పోలీసులు సమష్టిగా పని చేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన వివిధ రకాల పౌష్టికాహార వంటకాలను పరిశీలించి తిని రుచి చూశారు. అనంతరం 5వ తరగతి పూర్తైన 27 మంది విద్యార్థులను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రవేశం కల్పించారు. జిల్లాలో బడి ఈడు పిల్లలను గుర్తించి ఈ నెల 22లోపు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రత్యేకాధికారి తెలిపారు. అంతకు ముందు స్థానిక మోడల్‌స్కూల్ సమీపంలో ఉన్న బీసీ కాలనీని అధికారుల బృందంతో ప్రత్యేకాధికారిణి పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మండల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంఈఓ 1 రఘురామిరెడ్డి, ఎంఈఓ 2 వీరప్రతాప్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీత్‌క్రిష్ణ, పంచాయతీ రాజ్ ఏఈ వెంకటయ్య, ప్రధానోపాధ్యాయులు ఆదామ్, వెంకటేశ్వర్లు, సర్పంచ్ మేకల ఓబులేసు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లోక రక్షకుడు ఏసు

- రన్‌ఫర్ జీసెస్ పీస్ ర్యాలీలో పాస్టర్లు


రన్‌ఫర్ జీసెస్ పీస్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న పాస్టర్లు

నంద్యాల(న్యూటౌన్): ఏసుక్రీస్తు లోకరక్షకుడు అని, ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గంలో నడవాలని నంద్యాల పాస్టర్లు భాస్కర్‌రావు, ఏసుదాసు, అన్నాస్, రన్‌ఫర్ జీసెస్ కన్వీనర్ రవీంద్ర పాల్ అన్నారు. శనివారం పట్టణంలోని స్థానిక హోలీక్రాస్ కెథడ్రల్ చర్చి వద్ద నుంచి రన్‌ఫర్ జీసెస్ పీస్ ర్యాలీ చేపట్టారు. వైఎస్సార్ జంక్షన్, సంజీవనగర్, శ్రీనివాసనగర్, సాయిబాబానగర్, ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు, దేవనగర్, వీసీ కాలనీ మీదుగా తిరిగి చర్చి వరకు ఈ ర్యాలీ సాగింది. క్రీస్తు లేచెను...హల్లెలూయా అంటూ క్రైస్తవులు నినాదాలు చేస్తూ పరుగులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ క్రీస్తు సిలువ శ్రమలను పొంది మరణించిన అనంతరం పునరుత్థానుదయ్యారన్నారు. ఈ విజయానికి గుర్తుగా ప్రతి క్రైస్తవ విశ్వాసి విజయ యాత్రలో (పీస్ ర్యాలీ) పాల్గొనాలని పిలుపునిచ్చారు. క్రీస్తు సిలువపై మానవాళి రక్షణకొరకు ప్రాణ త్యాగం చేయడం ఒక చారిత్రాత్మక సంఘటన అన్నారు.

బెంగాల్లో రాష్ట్రపతి పాలన విధించాలి


కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): పశ్చిమ బెంగాల్‌లో శాంతిభద్రతలు అదుపుతప్పాయని, వక్ఫ్ చట్ట వ్యతిరేక ఆందోళనల ముసుగులో హిందూవులపై దాడులు జరుగుతున్నాయని విశ్వ హిందూ పరిషత్ నాయకులు ఆరోపించారు. వెంటనే రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేస్తూ శనివారం వారు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి , రాష్ట్ర ఉపాధ్యక్షుడు యర్రం విష్ణువర్ధన్‌రెడ్డి, బజరంగదళ్ రాష్ట్ర కన్వీనర్ పోలేపల్లి సందీప్, జిల్లా ఉపాధ్యక్షుడు శేష సాయి, నాయకులు చిలుకూరి శ్రీనివాస్, మేడా మురళీ, ఇనుగూరి రమేష్, రాంప్రసాద్, విశ్వనాథరెడ్డి, కిరణ్, నరసింహ వెంకట సుబ్బయ్య, చంద్రశేఖర్ తదితరులు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

దమ్ముంటే ఆళ్లగడ్డలో జరిగే అరాచకాలపై ప్రశ్నించు

- ఎంపీ శబరిని ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమా కిషోర్‌రెడ్డి
- తిరుమలలో గోవుల మృతిపై ఆమె వ్యాఖ్యలు సిగ్గుచేటని వెల్లడి


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమా కిషోర్‌రెడ్డి

ఆళ్లగడ్డ: నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి దమ్ముంటే ఆళ్లగడ్డలో కూటమి ఎమ్మెల్యే అఖిలప్రియ చేసే అరాచకాలపై ప్రశ్నించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమా కిషోర్‌రెడ్డి నిలదీశారు. ఆళ్లగడ్డ పట్టణంలో గేట్ల అధిక వసూళ్ల కోసం టీడీపీ నాయకులు కొట్టుకుంటున్నారని చెప్పారు. ఎమ్మెల్యే అఖిలప్రియను కలవాలంటే అనుచరులు రూ. 1000 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇవ్వకుంటే బజార్లో కొడుతున్నారని అన్నారు. మున్సిపాలిటీ గేట్ల విషయంలో ఇష్టాను సారంగా వసూలు చేస్తూ సామాన్యులను, చిరు వ్యాపారులను దోచుకుంటున్నారని చెప్పారు. వీటిపై ఎంపీ స్పందించకుండా తిరుమలలో గోవుల మృతిపై మాట్లాడటం సిగ్గు చేటన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అహోబిలం వచ్చిన ఎంపీ తిరుమలలో గోవుల మృతిపై టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకరరెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని అనడం సరికాదన్నారు. స్వయాన బీజేపీ నాయకుడు సుబ్రహ్మణ్యం స్వామే అక్కడ అపచారం జరిగిందని సుప్రీం కోర్టులో కేసు వేస్తానని చెప్పడంతో పాటు టీటీడీ చైర్మన్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని సీఎంకు లేఖ రాసిన విషయం తెలుసుకోవాలన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఆళ్లగడ్డ నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ నిధుల్లో నుంచి శబరి ఒక్క రూపాయ కూడా కేటాయించలేదని మండిపడ్డారు.

ఉపాధి సిబ్బందికి నోటీసులు

నంద్యాల(అర్బన్): జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఫాంపాండ్స్, పశువుల నీటి తొట్ల నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ముగ్గురు ఈసీలు, 68 మంది టీఏలకు తాత్కాలికంగా విధుల నుంచి తొలగింపు నోటీసులు జారీ చేసినట్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీ వెంకటసుబ్బయ్య శనివారం తెలిపారు. జిల్లాలో 506 పశువుల నీటి తొట్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 109 మాత్రమే పూర్తయ్యాయన్నారు. అదే విధంగా 2500 ఫారంపాండ్స్‌లలో 200 మాత్రమే పూర్తయ్యాయన్నారు. ఒక వారంలో పూర్తి కావాల్సిన పనులు ఈనెల 1వ తేదీ నుంచి జరుగుతున్నా పనులు సకాలంలో పూర్తి కాలేదన్నారు. ఇందుకు బాధ్యతగా 71 మంది సిబ్బందికి విధుల నుంచి తొలగింపు నోటీసులు ఇచ్చామని చెప్పారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

చాగలమర్రి: భవితరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని మండల ప్రత్యేక అధికారి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఓబులేసు అన్నారు. చాగలమర్రి మేజర్ గ్రామ పంచాయతీలో మూడో శనివారం సందర్భంగా స్వచ్ఛ దివాస్ ర్యాలీ నిర్వహించారు. వ్యర్థ పదార్థాల ఈ సైక్లింగ్‌పై పాత గ్రామపంచాయితీ కార్యాలయం వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, ఈఓపీఆర్‌డీ తాహెర్ హుసేన్, తహసీల్దార్ రవికుమార్, ఎంఈఓలు అనురాధ, న్యామతుల్లా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, పంచాయతీ కార్యదర్శులు మనోజ్ కుమార్, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

లోకకల్యాణం కోసం మహామృత్యుంజయ హోమం


మహా మృత్యుంజయ హోమంలో పూర్ణాహుతి గావిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం లోక కల్యాణార్థం మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఈ హోమాన్ని పద్మావతినగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో వేదపండితులు యాడవల్లి కార్తికేయశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి నగరడోన సుధీర్ మాట్లాడుతూ శ్రీ విశ్వవసు నామ సంవత్సర ప్రారంభంలోనే షష్ఠ గ్రహ కూటమి సంభవిస్తున్న సందర్భంగా ప్రకృతి వైపరీత్యాలు తలెత్తే అవకాశాలున్నాయన్నారు. ఈ అరిష్టాలన్నీ తొలగి పాలకులు, ప్రజలు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని మహా మృత్యుంజయ హోమం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాది తులసిరెడ్డి, బాలమురళీకృష్ణ, రాజశేఖర్, ఆదినారాయణ, బాల గంగాధర శాస్త్రి, పావని, మల్లిక, స్వర్ణ, చంద్ర, ప్రసాద్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రవికృష్ణకు అభినందన

నంద్యాల(వ్యవసాయం): కందుకూరి వీరేశలింగం 177వ జయంతి, తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడలో ప్రభుత్వం నుంచి పురస్కారం అందుకున్న డాక్టర్ రవికృష్ణను శనివారం నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఆ సంఘం నాయకులు ఆయనకు శాలువ, పూలమాల వేసి అభినందించారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు ఎంపీపీ రమణయ్య, సుబ్బారెడ్డి, వెంకటరావు, మధుకుమార్, అలా మధు, లయ న్స్ క్లబ్ సభ్యుడు వాసు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

నంద్యాల(న్యూటౌన్): ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని నంద్యాల జిల్లా ప్రత్యేక అధికారి నివాస్ అన్నారు.శనివారం నంద్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై మెప్మా, సచివాలయ, మున్సిపల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ యంత్రాల సేకరణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

పంట కొనుగోళ్లకు ఈకేవైసీ తప్పనిసరి

నంద్యాల(అర్బన్): ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసే ప్రతి పంట దిగుబడికి రైతులు ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాల్సి ఉంటుందని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు చెప్పారు. స్థానిక కార్యాలయంలో శనివారం రైతు సేవా సిబ్బందికి జొన్న కొనుగోళ్లు, మట్టి నమూనాల సేకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 2024–25 రబీ సీజన్‌లో నంద్యాల మండలంలో 4,403 ఎకరాల్లో జొన్న పంట సాగు చేశారని, ప్రభుత్వం క్వింటాకు కనీస మద్దతు ధర రూ.3,371తో కొనుగోలు చేస్తుందన్నారు. దిగుబడి విక్రయించుకునేందుకు ఈకేవైసీ చేయించుకోని రైతులు రైతు సేవా కేంద్రంలో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

రేపు మోడల్‌స్కూల్ ప్రవేశ పరీక్ష

ఉయ్యాలవాడ : స్థానిక మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరం సంబంధించి 6వ తరగతిలో ప్రవేశం కోసం సోమవారం అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లో ప్రవేశం కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో 119 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో లేదా స్కూల్ వద్దకు వచ్చి హాల్ టికెట్లు పొందవచ్చునన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఫలితాలను బట్టి ఖాళీగా ఉన్న 100 సీట్లలో విద్యార్థులను ఎంపిక చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

క్రైం కార్నర్

కానిస్టేబుల్ హత్య కేసు నిందితుల అరెస్టు


నిందితులను అరెస్ట్ చూపిస్తున్న సీఐ దస్తగిరిబాబు

ఆళ్లగడ్డ: నల్లమల అడవి బొగద సమీపంలో ఇటీవల జరిగిన కానిస్టేబుల్ ఫరూక్ (32) హత్య కేసును పోలీసులు ఛేదించారు. కానిస్టేబుల్ ప్రియురాలు హనీఫా కూతురు ప్రియుడు షేక్ షబ్బీర్‌బాషాతో పాటు మరో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు శిరివెళ్ల సీఐ దస్తగిరిబాబు శనివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు..కోటకందుకూరు గ్రామానికి చెందిన ఫరూక్ అక్టోఫస్ కానిస్టేబుల్‌గా మంగళగిరిలో విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి హనీఫా అనే మహిళతో వివాహేతర సంబంధం ఉండటంతో నంద్యాల సమీపంలోని నందమూర్‌నగర్‌లో ఇల్లు బాడుగకు తీసుకుని సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో హనీఫా కూతురిపై కూడా కన్నేసిన అతను ఆ యువతిని మానసికంగా శారీరకంగా వేధించసాగాడు. అయితే ఆ యువతి ఫరూక్ స్నేహితుడైన షబ్బీర్ బాష అనే యువకుడిని ప్రేమించడంతోపాటు వారు పెళ్లి చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలిసన ఫరూక్ ఆ యువకుడిని బెదిరించాడు. దీంతో ఎలాగైనా ఫరూక్ అడ్డుతొలగించుకోవాలని నిర్ధారించుకున్న షబ్బీర్ ఈనెల 8వ తేదీ అతను నంద్యాలకు వచ్చాడన్న విషయం తెలుసుకుని ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం కారు తీసుకెళ్లాడు. బయటకు వెళ్లి ఏమైనా తిందామని ఫరూక్‌ను ఆ కారులో ఎక్కించుకుని స్నేహితులైన మరో నలుగురు యువకులకు ఫోన్‌చేసి మోటర్ బైక్‌లపై ఫాలో కావాలని చెప్పాడు. వారు కారు వెంట వెళ్లి అయ్యలూరు మెట్ట ప్రాంతంలో తాడును గొంతుకు బిగించి కారులోనే హత్య చేసి మృతదేహాన్ని చాగలమర్రి మండలం బైరవగుండాల్లో పడేశారు. శవం తేలితే విషయం బయటకు వస్తుందని 10వ తేదీ మృతదేహాన్ని బయటకు తీసి సూపర్ కవర్‌లో చుట్టి నల్లమల అడవిలోని పాత బొగద సమీపంలో లోయలో పడేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న మంగళగిరి పోలీసులు నంద్యాల పోలీసులతో కలిసి తమదైన శైలిలో విచారణ చేయగా నిందితులు మృతదేహాన్ని చూపించారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న శిరివెళ్ల పోలీసులు నిందితులు షేక్ షబ్బీర్, సయ్యద్ రియాజ్, షేక్ అబ్దుల్లా, షేక్ అబ్దుల్, షేక్ ఫాజిల్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు

అప్పుల బాధతో..

రుద్రవరం: మందలూరుకు చెందిన నరసింహారెడ్డి (38)అనేరైతు శనివారం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఏఎస్ఐ బాలన్న తెలిపిన వివరాల మేరకు.. నరసింహారెడ్డి తన సొంత పొలంతో పాటు మరి కొంత భూమి కౌలుకు తీసుకొని మొత్తం 22 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. అయితే, పండిన అరకొర పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్ట పోయాడు. ఆయా పంటల సాగు కోసం దాదాపు రూ.10లక్షల వరకు అప్పు చేశాడు. అప్పు తీర్చే దారి కన్పించకపోవడంతో మనస్థాపానికి గురై ఈ నెల 12వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. ఈమేరకు మృతుడి భార్య పద్మావతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.


మృతుడు నరసింహారెడ్డి

అనారోగ్యంతో బాలిక మృతి


సారా(ఫైల్)

దొర్నిపాడు: మండల పరిధి లోని చాకరాజువేముల గ్రామానికి చెందిన ఓ బాలిక అనారోగ్యంతో శనివారం మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దేవరాజుకు ఐదుగురు కూతుళ్లు ఉన్నారు. వారిలో ఇద్దరికి పెళ్లి అయింది. నాల్గో కూతురు అయిన సారా దొర్నిపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదు వుతూ ఇటీవల పదోతరగతి పరీక్షలు రాసింది. గత రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఈ బాలికను తల్లిదండ్రులు స్థానిక వైద్యశాలకు తీసుకెళ్లి చూపించారు. శనివారం జ్వరం తీవ్రం కావడం, దానికితోడు కడుపునొప్పి రావడంతో అపస్మారక స్థితిలోకి చేరుకుంది. వెంటనే తల్లిదండ్రులు ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. బాలిక మృతి విషయం తెలుసుకున్న హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గడ్డివామి దగ్ధం

రుద్రవరం: నక్కలదిన్నెలో శనివారం సంభవించిన అగ్ని ప్రమాదంలో పల్లె చిన్న లింగారెడ్డికి చెందిన గడ్డివామి దగ్ధమైంది. బాధిత రైతు పశువుల కోసం గ్రాసం కొనుగోలు చేసి వామిగా వేసుకున్నాడు. అయితే ఊరు శివారు పొలాల్లోని వ్యర్థాలను తొలగించుకునేందుకు రైతులు రాజేసిన మంటల్లో నుంచి నిప్పు రవ్వలు ఎగిరివచ్చి గడ్డివామిపై పడటం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండొొచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గడ్డివామి నుంచి మంటలు పెద్దగా చెలరేగగానే చుట్టు పక్కల వారు స్పందించి ఆ మంటలను ఆర్పారు.


లోపాలు సవరించాలి


నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిలో ఉన్న లోపాలను సవరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి శివయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కోర్టు తీర్పు ప్రకారం లాంగ్వేజ్ పండిట్లకు ప్రమోషన్ ఇచ్చిన తర్వాత అర్హులైన ఎస్‌జీటీలకు తెలుగు హిందీ ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలను విడివిడిగానే నిర్వహించాలన్నారు. ఒకటి నుండి 5 తరగతులకు ఎస్‌జీటీలు మాత్రమే బోధన జరపాలన్నారు.


అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి

ఆళ్లగడ్డ: వేసవి సెలవులలో ఇంటికి వెళ్లినప్పుడు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ యుగంధర్ బాలికలకు సూచించారు. స్థానిక ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ బాలికల పాఠశాలలో శనివారం బాలికల భద్రత, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ క్రైంలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ బాలి కలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి పాఠశాలల్లో తెలియజేయాలన్నారు. అలాగే ఈ మధ్య సైబర్ మోసాలు పెరిగి పోయాయని, వ్యక్తిగత సమాచారం ఎవరితోనూ పంచుకోరాదన్నారు. సెలవుల్లో ఈత రాని వాళ్లు చెరువుల వద్దకు వెళ్లవద్దని సూచించారు. మహిళల భద్రతకు ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి యాప్ గురించి తెలియజేశారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ప్రతిభ


నరసింహ


సుమిత్ర


ప్రకాష్

నంద్యాల(న్యూటౌన్): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమ విద్యాసంస్థ విద్యార్థులు ఆల్ ఇండియా ర్యాంకులు సాధించినట్లు ఎస్‌డీఆర్ ఆకాంక్ష జూనియర్ కళాశాల చైర్మన్ కొండారెడ్డి తెలిపారు. నరసింహ ఇల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 99.85 శాతంతో 2,452 ర్యాంకు, ప్రకాష్ ఓబీసీ కేటగిరి 99.46 శాతంతో 1,793 ర్యాంకులు, సుమిత్ర 99.83 శాతంతో ప్రభంజనం సృష్టించినట్లు ఆయన తెలిపారు. 95 శాతంతో 8 మంది, 90 శాతంతో 17 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారు. ఇందుకు కృషి చేసిన అధ్యాపకులను చైర్మన్ అభినందించారు.

- జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో నంద్యాలకు చెందిన రావూస్ విద్యార్థులు సత్తా చాటినట్లు కళాశాల చైర్మన్ అప్పారావు, డైరెక్టర్ మోనిచంద్ర తెలిపారు. అత్యుత్తమ పర్సెంటేజీ సాధించిన విద్యార్థులను శనివారం వారు అభినందించారు. తమ కళాశాలకు చెందిన పూర్ణేష్‌రావు, సుబ్బసాయి సహస్ర, శ్రావ్య, సబా, టౌఫిక్ హుసేన్, వెంకట హీరేష్ తదితర విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.